# నిద్రపోతున్న నిఘా నేత్రాలు

- సిరికొండలో పని చేయని సీసీ కెమెరాలు
- కొరవడిన పర్యవేక్షణ
- నెలలు గడుస్తున్నా.. పట్టించుకోని వైనం

సిరికొండ: మండల కేంద్రంలో దొంగతనాలు, ఏదైనా సంఘటనలు జరిగినా వెంటనే నిందితులను గుర్తించేందుకు నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు అవగాహన కల్పించడంతో 2018లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సుమారుగా రూ. 2లక్షల రుపాయలు ఖర్చు చేసి ప్రధాన కూడళ్ల వద్ద 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటులో వ్యాపారులు కూడా ఆర్థిక సాయం అందించారు. అయితే వీటి నిర్వహణ బాధ్యత మాత్ర పోలీసులదే. ఇంత ఖర్చు పెట్టి ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. గత సంవత్సరం నుంచి కెమెరాలు పని చేయకపోవడంతో మండలే కేంద్రంలో నిఘా కొరవడింది. ఏదైనా దొంగతనాలు, ఘటనలు జరిగితే ఎలా అని మండలవాసులు ఆందోళన చెందుతున్నారు.



మండల కేంద్రంలో పని చేయాని సీసీ కెమెరా

### చోరీకి గురవుతున్న వాహనాలు

మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో గత కొన్ని రోజుల క్రితం మండలానికి చెందిన విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ బైక్ చోరీకి గురైంది. దొంగ వాహనాన్ని మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతానికి తీసుకెళ్లాడు. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగను పట్టుకోలేకపోయారు. అదే కెమెరాలు పని చేస్తే దొంగను గుర్తించే వారు.

### ఎన్నికల వేళ కెమెరాలు పని చేస్తే..

ఎన్నికల వేళ సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ప్రజలకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. సీసీ కెమెరాలు పని చేస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉంటుంది. వ్యాపారులు తమ వ్యాపార సముదాయాల వద్ద సొంతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### మరమ్మతులు చేయాలి



మండల కేంద్రంలో పని చేయకుండా నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలి. సీసీ కెమెరాలు పని చేస్తే దొంగతనాలు, నేరాలు జరిగితే నిందితులను వెంటనే గుర్తించవచ్చు. అలాగే నేరాలు కూడా అదుపులో ఉంటాయి.

– అశీల మధు, మెడికల్ వ్యాపారి, సిరికొండ

### పట్టించుకోవడం లేదు



గ్రామాభివృద్ధి కమిటీ నిధులు సేకరించి మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గత కొద్ది రోజులుగా పని చేయడం లేదు. మరమ్మతుల విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి నూతన కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– బత్తిని సతీష్, వ్యాపారి, సిరికొండ

### వినియోగంలోనికి తీసుకువస్తాం

మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పని చేయని విషయం వాస్తవం. త్వరలోనే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేసి వినియోగంలోనికి తీసుకువస్తాం. శాంతి, భద్రతలు కాపాడడంలో సీసీ కెమెరాలు ఎంతోగానే ఉపయోగపడుతాయి.

– శ్రీకాంత్, ఎస్సై, సిరికొండ

# బీజేపీకి ఓటమి భయం పట్టుకుంది

- ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగురామన్న

జైనథ్: బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, అందులో భాగంగానే తన ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడ గ్రామంలో బీజేపీ నాయకులు జోగు రామన్న ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఈసందర్భంగా పోలీసులకు, బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టించడం నెలకొనడం తనకు ఇష్టం లేదని, అందుకే ప్రచారం చేయకుండా వెనుదిరుగుతున్నట్లు జోగు రామన్న తెలిపారు. అనంతరం ముక్తాపూర్, కంఠ గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మహిళలకు రూ. 3వేల జీవన భృతి, అందరికి రూ. 5లక్షల బీమా, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. ఈసందర్భంగా పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు సర్పన్ లింగారెడ్డి, పెందూర్ దేవన్న, తదితరులు పాల్గొన్నారు.



జోగు రామన్నకు స్వాగతం పలుకుతున్న మహిళలు

# బీజేపీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి

- బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావ్

గుడిహత్నూర్: బీజేపీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండలంలోని శంభూగూడ, మన్నూర్, ఇస్రూగూడ, గోండ్‌హర్కాపూర్, శాంతాపూర్, ఉమ్రి, సూర్యగూడ, కొల్హారీ, మాన్కాపూర్, బొర్రమద్ది, తోషం, తోయగూడ, సోయంగూడ, తెలంగ్‌రావ్ గూడ, గర్కంపేట్, మల్కాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. ఆయన వెంట ఎంపీపీ భరత్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, బీజేపీ మండలాధ్యక్షుడు జాడి సుభాష్, కరాడ్ బ్రహ్మానంద్, సోయం వెంకటేశ్, జాలీంషా, మాధవ్‌రావ్ ఆమ్టే, ఆర్యన్ మహరాజ్, కేంద్రే కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోయం బాపూరావ్

**ప్రజాపాలన బీజేపీతోనే సాధ్యం**

బోథ్: ప్రజాపాలన బీజేపీతోనే సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, రైల్వేబోర్డు సభ్యులు జి.వి.రమణ అన్నారు. శనివారం మండలంలోని నిగిని, కంటిగాం, మర్లపెల్లి, బాబెర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు పథకాల పేరుతో దోచుకున్నారని మండిపడ్డారు.

**'సోయం'ను గెలిపించండి**

నేరడిగొండ: బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావును గెలిపించాలని మండల కన్వీనర్ సోనయ్య హీరాసింగ్ కోరారు. శనివారం మండలంలోని వాగ్దారి, మాధాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, బాక్రె లక్ష్మణ్, తొడసం శంకర్, ప్రశాంత్, గట్టు నారాయణ, భీంరావు, శంకర్, గులాబ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్‌లో బీఆర్ఎస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌యూఐ నాయకులు, యువకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి జాన్సన్ నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు రమేశ్, ఎస్పీరెడ్డి, సోఫియాన్, ధరణి రాజేశ్, మర్సుకోల తిరుపతి, కొమ్ము విజయ్, చారులత రాథోడ్ పాల్గొన్నారు.

జన్నారం: బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదవత్ పూర్ణచంద్ నాయక్ అన్నారు. మండలంలోని కలమడుగు బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. నాయకులు విజయ్ ధర్మ, స్వదేశ్‌కుమార్, దేవేందర్, శంకర్ ఉన్నారు.

**సంక్షేమ పథకాలు చూసి ఓటు వేయండి**

ఇంద్రవెల్లి: దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, వాటిని చూసి ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు ఓటు వేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండలంలోని సట్వాజీగూడ, ఇంద్రవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ జాదవ్ లఖన్, మడావి భీంరావ్, కోవ రాజేశ్వర్, కనక తుకారం, బాబు ముండే ఉన్నారు.



బీఆర్ఎస్ నాయకులతో జాన్సన్‌నాయక్

**బీఆర్ఎస్‌కు విశేష ప్రజాదరణ**

ఖానాపూర్: నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు విశేష ఆదరణ వస్తోందని ఎమ్మెల్సీ దండె విఠల్, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి, ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు రవీందర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌తో కలిసి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మాట్లాడారు.

**ఊపందుకున్న బీఆర్ఎస్ ప్రచారం..**

శివాజీనగర్ కాలనీలో 2వ వార్డు కౌన్సిలర్ కారింగుల సంకీర్తన, మాజీ ఉప సర్పంచ్ సుమన్, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు వెంకటప్పయ్య ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

# అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్

నేరడిగొండ: ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రచారం చేశారు. వారసంతలో ప్రతిఒక్కరిని పలకరించి, ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంట వెంకటరమణ, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అనిల్ జాదవ్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం**

అనిల్ జాదవ్ గెలుపుతోనే బోథ్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. శనివారం మాట్‌లొద్ది, గోవింద్‌పూర్, నాగమల్యాల్, పీచర, అద్దాల తిమ్మాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బోథ్: గెలిచిన నెల రోజుల్లోనే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయిస్తానని బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మర్లపెల్లి, నిగిని, కంటిగాం, బాబెర, కరత్వాడ, నక్కలవాడ పట్నాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, బోథ్ సర్పంచ్ సురేందర్, బొడ్డు శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం**

ఇచ్చోడ: బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోకశిరీష్‌రెడ్డి, సర్వేదే రమేశ్ పాల్గొన్నారు.



వారసంతలో ప్రచారం చేస్తున్న అనిల్ జాదవ్

గుడిహత్నూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీ గెలిపిద్దామని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాల్లో ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా, రమేశ్ జాదవ్, మాధవ్ కేంద్రే, రావణ్ ముండే పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలి



పోల్ చీటీలు పంపిణీ చేస్తున్న రామారావు

ఇచ్చోడ: ప్రతిఒక్కరూ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు అన్నారు. శనివారం జల్దా, జామిడి, గేర్జం గ్రామాల్లో పోలింగ్ చీటీలను ఇంటింటా పంపిణీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ చీటీలను బీఎల్‌వోల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### పోలింగ్ కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న సీఐ భీమేశ్

బోథ్: మండలంలోని కౌఠ(బి), సాంగ్విపల్లెతో పాటు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బోథ్ సీఐ భీమేశ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవా లని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఇచ్చోడ: ఎన్నికలను ప్రశాతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ కోరారు. శనివారం మండలంలోని కేశవపట్నం, గుండాల, జోగిపెట్,బోరిగామ, కామాగిరి, సాథ్‌నంబర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై నరేశ్, సిబ్బంది ఉన్నారు.

### 'హస్యాస్పదంగా బాలూరి వ్యాఖ్యలు'

ఎదులాపురం: ఆదిలాబాద్ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ నాయకులు బాలూరి గోవర్ధన్ చేసిన వ్యాఖ్యలు హస్యాస్పదంగా ఉన్నాయని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. పట్టణంలోని దుర్గానగర్‌లో శనివారం మాట్లాడారు. నిన్నటి వరకు బీఆర్ఎస్ అభివృద్ధి, సీఎం కేసీఆర్‌ను పొగిడిన ఆయన అభివృద్ధి గురించి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు అజయ్, దినేష్, మహేశ్, జయరాం, షాజన్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ సైదారావు

బేల: ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలని జైనథ్ సర్కిల్ సీఐ కోల నరేశ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పాటన్, చప్రాల గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు చాలా విలువైనదని, ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా బెదిరింపులు చేస్తే, తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాధిక, ఏఆర్ ఎస్సై రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీసుల కవాతు**

అదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కూడళ్లల్లో ఆదిలాబాద్ సీఐ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసులతో కవాతు నిర్వహించారు. కేఆర్‌కే కాలనీ, పిట్టలవాడ, దోబీకాలనీ, కైలాసనగర్‌తో పాటు పలు ప్రధాన కూడళ్ల గుండా కవాతు సాగింది. ఈసందర్భంగా సీఐ సైదారావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా ప్రజలను అవగాహన కల్పించేందుకే కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మావల ఎస్సై విష్ణువర్ధన్, రిజర్వ్ ఎస్సై మహేందర్, క్యూఆర్టీ, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతులో పాల్గొన్న పోలీసులు

# రూ. 50వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దు


ఇచ్చోడ: ఖాతాదారులు బ్యాంకు ఖాతా నుంచి రూ. 50 వేలు అంతకన్న ఎక్కువ డబ్బులు డ్రా చేసి తీసుకువెళ్లవద్దని ఇచ్చోడ ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎక్కువ డబ్బులు తీసుకెళ్తే ఎందుకు తీసుకెళ్తున్నారో సంబంధిత పత్రాలు చూపించాలన్నారు. లేదంటే ఎన్నికల అధికారులు, పోలీసులు ఆ డబ్బును జప్తు చేసే అవకాశం ఉంటుందని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు బ్యాంకు అధికారుల తెలిపారు.

# అభివృద్ధికి దూరంగా గ్రామాలు

- కనీస వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న సుందర్‌నగర్, భగత్‌సింగ్ గ్రామస్తులు



భగత్‌సింగ్‌నగర్ గ్రామం



సుందర్‌నగర్ గ్రామం

ఇంద్రవెల్లి: ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా.. మండలంలోని సుందర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ గ్రామాలు మాత్రం మారడం లేదు. కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 17 సంవత్సరాల క్రితం ఏర్పడిన గ్రామాలకు రోడ్డు సౌకర్యం, అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేన్నారు.

**అభివృద్ధికి నోచుకోని గ్రామాలు**

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2006లో ఇంద్రవెల్లి పరిధిలో రెండు ఎకరాలు, ఏమాయికుంట పరిధిలో నాలుగు ఎకరాలు భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి నిరుపేదలకు ఇళ్ల కేటాయించారు. వాటికి సుందర్‌నగర్, భగత్‌సింగ్ గ్రామాలుగా నామకరణ చేశారు. మండల కేంద్రంతో పాటు చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన సుమారు 150కు పైగా నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కానీ నేటికి ఎలాంటి అభివృద్ధి చెందలేదని వాపోతున్నారు.



అధ్వానంగా అంతర్గత రోడ్డు

**అనేక సార్లు విన్నవించినా..**

గ్రామ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ గ్రామాల్లో సమస్యలు పట్టించుకోరు కానీ ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఎన్నికల కోసం ఓట్ల కోసం వచ్చి మోసపూరిత మాటలు చెప్పి మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమ గ్రామాల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### పట్టించుకోవడం లేదు



గ్రామ సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులతో పాటు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. చేసేది లేక అరకొర సౌకర్యాల మధ్య ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పటికైనా మా గ్రామాల సమస్యలను పరిష్కరించాలి.

– విక్రమ్, సుందర్‌నగర్

### ఎలాంటి వసతులు లేవు



మా గ్రామం ఏర్పడి 17 సంవత్సరాలు అవుతుంది. కానీ కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదు. దీంతో నిత్యం తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. హామీలు ఇస్తున్నారు తప్ప అమలుకు నోచుకోవడం లేదు.

– కాంబ్లే శోభబాయి, సుందర్‌నగర్

### రోడ్డుపైనే వారసంత..



నేరడిగొండ: మండల కేంద్రంలో ప్రతీ శనివారం నిర్వహించే వారసంతతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సర్వీసు రోడ్లపై వారసంత ఉండడంతో ఆర్టీసీ బస్సులు, వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. సర్వీసు రోడ్లపై వారసంత పెట్టకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.